మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం
14 అక్టోబర్ 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

# నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి.

- పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు రూ. 4.26 కోట్లు మంజూరు.
- కంబోడియా, థాయ్‌లాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు.

**ఖమ్మం నేలకొండపల్లి అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:**





జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణపై బౌద్ధ బీక్షువుల సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని తెలిపారు. నేలకొండపల్లి లో గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం, బౌద్ధ విహారాలు, సమావేశ మందిరాలు, ఇతర బౌద్ధ నిర్మాణాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పురావస్తు ఆధారాలు ప్రాచీన కాలంలో నేలకొండపల్లి ప్రముఖ బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిందని తెలియజేస్తున్నాయని, ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతోపాటు, దేశవిదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు.కేవలం ఒక భవన నిర్మాణంలా కాకుండా, బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా, దానికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన కోసం పురావస్తు శాఖ సంచాలకులతో పాటు బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కూడిన ఒక నిపుణుల కమిటీ కోర్ టీము ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బౌద్ధ భిక్షువులు, నిపుణుల సలహాలు, సూచనలను స్వీకరించి వచ్చే ఒకటిన్నర సంవత్సరంలో నేలకొండపల్లిని అత్యున్నత బౌద్ధ క్షేత్రంగా మారుస్తామని తెలిపారు. జీవనంలో మోహాలు, మాయలు వీడి, గౌతమ బుద్ధుడు చూపిన మధ్యే మార్గం ద్వారానే మానవజాతి శాంతియుతంగా జీవించగలదని, అటువంటి మహోన్నత జ్ఞానాన్ని అందించిన బౌద్ధ ధర్మ ప్రచారానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భారతదేశంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాల సరసన నేలకొండపల్లిని టాప్-3 లో నిలపడమే లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటకులకు అవసరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు, సందర్శకుల మార్గాలు, ప్రాంగణ సుందరీకరణ, సమాచార సూచికలు, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు. రూ. 1.76 కోట్ల వ్యయంతో ప్రాచీన బౌద్ధ విహారాలు, సమావేశ మందిరం, సంబంధిత పురావస్తు నిర్మాణాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధులను వైటీపీఎస్, తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చుకున్నట్లు అన్నారు. పురావస్తు కట్టడాల అసలు నిర్మాణ స్వరూపం, చారిత్రక ప్రాధాన్యత, నిర్మాణ శైలి దెబ్బతినకుండా శాస్త్రీయ పరిరక్షణ పద్ధతుల్లో పనులను చేపట్టనున్నట్లు హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ తెలిపారు.కంబోడియా, థాయ్‌లాండ్, భారత దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నేలకొండపల్లి ప్రాచీన బౌద్ధ క్షేత్రం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతపై ఆసక్తి వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మహాస్తూపం, బౌద్ధ విహారాలు, ఇతర ప్రాచీన నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, ప్రపంచ బౌద్ధ యాత్రికులను ఆకర్షించే ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. ఇట్టి చర్చల్లో హెరిటేజ్ తెలంగాణ శాఖ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు, పర్యాటక రంగ నిపుణులు, కన్సల్టెంట్లతోపాటు ఆంజనేయ రెడ్డి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సలహాలు, సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించారు. ఈ ప్రణాళికలో మహాస్తూపం పరిరక్షణ, బౌద్ధ విహారాల పునరుద్ధరణ, పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, సందర్శకుల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, బౌద్ధ చరిత్రను వివరించే సమాచార వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమీషనర్ పివి. శ్రీనివాస రావు, హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డా. పి. నాగరాజు, ఎన్. నరసింగ్, సూపరింటెండెంట్ ఎ. రాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, హైదరాబాద్ ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా. ఇ. శివనాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు, పురావస్తు పరిశోధకులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి.

- భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి.
- రీసర్వేలో తప్పులకు తావులేకుండా పారదర్శకంగా భూ వివరాల నమోదు.
- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి.

**ఖమ్మం అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:**



జిల్లాలో భూముల రీసర్వే పనులను పకడ్బందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. పెనుబల్లి మండలం తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామం, కల్లూరు మండలం రఘునాధగూడెం రెవెన్యూ గ్రామం, తల్లాడ మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు రీసర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ పురోగతిని సమీక్షించాలని, పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తల్లాడ, పెనుబల్లి, కల్లూరు తహశీల్దార్లు కె. కరుణాకర్ రెడ్డి, జి. వీరభద్ర నాయక్, కె. బ్రహ్మేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవ లాభాలు ప్రకటించకుండా కార్మిక ద్రోహానికి పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం..

- డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్

**ఇల్లందు ,అక్టోబర్ 13. మీ వార్త ప్రతినిధి**







గత ఆర్థిక సంవత్సరం 2025-26 కు సంబంధించిన వాస్తవ లాభాలు 2020 కోట్లు వస్తే వాటిని ప్రకటించకుండా అంకెల గారడి చేసి 1754 కోట్ల లాభాలు మాత్రమే చూపడం కార్మికులను మోసం చేయడమే అని డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ లు సంయుక్తంగా పత్రిక ప్రకటన విడుదల చేసారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం ప్రకటించిన లాభాలలో 34 శాతాన్ని కార్మికులకు ఇచ్చారు. కనీసం ఒక శాతం కూడా పెంచకుండా అదే 34 శాతాన్ని ఈ సంవత్సరం కూడా ఇవ్వడాన్ని కార్మిక వర్గం జీర్ణించుకోలేక పోతుంది. వెంటనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలు ప్రకటించి, కార్మికులకు 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము. కార్మికులపై ఏమాత్రం ప్రేమలేని దోపిడీ లక్ష్యంగా కార్మికుల సొమ్మును దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తింపు సంఘాన్ని కూడా సంప్రదించకుండా లాభాలు ప్రకటించడం, గుర్తింపు సంఘాన్ని పిలిస్తే వాస్తవ లాభాలు ప్రకటించి పర్సంటేజ్ పెంచి కార్మికులకు ఇవ్వాల్సి వస్తుందని గ్రహించి ఈ సమావేశానికి గుర్తింపు సంఘాన్ని పిలవకుండా కార్మికులను మోసం చేశారని వారు అన్నారు. విజ్ఞులు అయిన కార్మికులు ఇలాంటి మోసాలను గ్రహించాలని పాలకవర్గ ప్రభుత్వాలు అలాగే ప్రభుత్వ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎప్పుడైనా ఎవరైనా కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడే వారనే విషయాన్ని గ్రహించాలని కార్మికులను కోరుతూ రాబోవు రోజుల్లో కార్మిక వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడిన మిలిటెంట్ పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని తెలియజేస్తూ ఉన్నాము అని వారు అన్నారు

# ఒకే బంధు వర్గానికి పదవులా.

- మున్నూరు కాపు సంఘం మూడు ముక్కలు కావడానికి కారణం మీరు కాదా.
- కలిసి పోవడానికి మేము సిద్ధమే.
- త్వరలో జిల్లా, నగర కమిటీలు వేస్తాం.

**ఖమ్మం అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:**



మున్నూరు కాపు సంఘంలో ఒకే బంధు వర్గానికి పదవులా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. ఖమ్మం లోని రాపర్తి శరత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మున్నూరు కాపు సంఘం సీనియర్ రాష్ట్ర నాయకులు శెట్టి రంగారావు, మాజీ కార్పొరేటర్, సంఘం నగర అధ్యక్షులు రాపర్తి శరత్ మాట్లాడారు. సీనియర్ నాయకులు మేకల సంగయ్య ఫోటో లేకుండా ఫ్లెక్సీలు వేశారని, ఇది అవమానకరమని అన్నారు. అందరూ కలిసి ఉండాలని అనే ఉద్దేశ్యంతో ఏనాడూ సంఘంలో పని చెయ్యని శీలంశెట్టి వీరభద్రం ను జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించినా తాము అంగీకరించామన్నారు. 11 ఏళ్ల నుండి సంఘాన్ని అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకున్నదెవరో అందరికీ తెలుసునన్నారు. రాపర్తి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిని నగర అధ్యక్షులు గా నియమించినందుకు కుట్ర చేశారన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి తమను ఎందుకు పిలువలేదో చెప్పాలన్నారు. కలిసిపోయే గుణముంటే తమను పిలిపించి మాట్లాడాలి కదా అన్నారు. కలిసిపోవడానికి తాము సిద్ధమేనన్నారు. లేకుంటే కుల పెద్దలను సంప్రదించి తమ పని తాము చేసుకపోతామన్నారు. త్వరలోనే జిల్లా, నగర కమిటీలు వేస్తామన్నారు. ఈ సమావేశం లో ట్రస్టు బోర్డు సెక్రటరీ కలిశెట్టి నర్సయ్య, గౌరవ సలహాదారులు మూలగుండ్ల శ్రీహరి, నగర కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి గంగిశెట్టి శ్రీనివాస్, కోయచలక ఉప సర్పంచ్ మాధవశెట్టి హన్మంతరావు, కార్మిక విభాగం అధ్యక్షుడు విప్లవ కుమార్, మహిళా విభాగం నాయకురాలు బాసెట్టి శ్రావ్య, నాయకులు బైరిశెట్టి పవన్ కుమార్, పసుపు లేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో 36 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ.

- అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.

**చర్ల అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:**







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు 36 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం అర్హులైన కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

కళ్యాణలక్ష్మి పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని, అర్హత కలిగిన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గామాత



**కారేపల్లి అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:**

సింగరేణి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.పలువురు దంపతులు మండపాల్లో పీటలపై కూర్చుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్.

**ఖమ్మం అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:**



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్‌తో పాటు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని కలవడం యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, రానున్న రోజుల్లో ఖమ్మం జిల్లాలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్ తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యేజారె.

**దమ్మపేట అక్టోబర్13 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**




దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు మెచ్చు రాణి వైఫ్ /ఆఫ్ మెచ్చు వెంకటేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో 'జీ తెలుగు' ఆధ్వర్యంలో నిర్వహించిన "గురు వందనం-2026" కార్యక్రంలో ఆమె ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కె కేశవరావు తెలంగాణ ప్రభుత్వం ముఖ్య సలహాదారులు, ఎంపి ఈటల రాజేంద్ర, ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, మంత్రులు మరియు ప్రముఖులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు జిల్లా స్థాయిలో గుర్తింపు పొంది అవార్డు అందుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో కీలక పాత్ర పోషించడం గర్వకారణంగా ఉందని తెలిపారు. మెచ్చు రాణి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**- గంగుల తిరుపతి యాదవ్ బీసీ సెల్ జిల్లా కన్వీనర్**

**కొత్తగూడెం అక్టోబర్ 13 మీ వార్త ఆర్ సి**



ఈ సంవత్సరం దేశంలో ,,ఎల్ నీ ఓ,, ప్రభావం వల్ల వర్షాలు పడకపోవడం, విపరీతమైన ఎండలు కాయటం వలన వర్షాలు చాలా తక్కువగా నమోదు అవ్వడం వల్ల రాష్ట్రంలో అన్ని జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరి పంటలు పత్తి పంట మరియు ఇతరత్రా పంటలు ఎండిపోవడం బాధాకరమైన విషయం, జిల్లాను ఆనుకొని ఒకపక్క కృష్ణా మరోపక్క గోదావరి నదులు దివ్యంగా మారుతున్న, పాలేరు కిన్నెరసాని లాంటి రిజర్వాయర్ లున్నా పంట పొలాలకు నీరు అందకపోవడం దురదృష్టకరం, రైతులు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసినప్పటికీ ఎలాంటి పంట దిగుబడి రాకపోవడం వలన రైతులు చాలా నష్టపోయారు ఈ నష్టాన్ని రైతులు కుపూడ్చాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోనూ నా రైతులతో పాటు భద్రాద్రికొత్తగూడెం జిల్లా రైతులను ఆదుకోవాలని తక్షణమే ఈ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని ఎకరానికి 30 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారాన్ని అందించాలని గంగుల తిరుపతి ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు

## ముచ్చర్ల లో వైద్య శిబిరం రోగులకు ఆరోగ్య పరీక్షలు



**కామేపల్లి, అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి :**




కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు పరీక్షలు చేసి ఆరోగ్యపరమైన పలు సూచనలు చేశారు. వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ సందర్శించారు. ఈ వైద్య శిబిరం లో పల్లె దవాఖానా సిబ్బంది పాల్గొన్నారు. నంతరం డ్రైడే కార్యక్ర మంలో సర్పంచ్ లూసీ పాల్గొని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. అనురాధ,పల్లె దవాఖాన సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి.







- సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి.
- ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న డెవలప్మెంట్ చార్జీలను రద్దు చేయాలి.
- సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి.
- దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి ఇంటి పన్నులను వెయ్యాలి..
- గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి..
- సిపిఐఎం గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు.
- సిపిఐఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా.
- అవినీతి ఆరోపణలపై విచారణ చేసి రిపోర్ట్ అందివ్వాలి: డిపిఓ ని ఆదేశించిన సబ్ కలెక్టర్

**భద్రాచలం అక్టోబర్ 13 మన మీ వార్త:**

భద్రాచలం గ్రామపంచాయతీలో నెలకొన్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని భద్రాచలం కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా స్వచ్ఛ పాలన అందించాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ప్లే కార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులలో అనేక అక్రమాలు జరిగాయి అని ఇటీవల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు. పంచాయతీలో నెలకొంటున్న అక్రమాల ప్రభావంతో పాలకవర్గంలో సైతం చీలికలు వస్తున్నాయని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు కూడా అనేక ఒక తోకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు సైతం బలంగా వినిపిస్తున్నాయని ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని నరసారెడ్డి డిమాండ్ చేశారు.

ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న డెవలప్మెంట్ చార్జీలను రద్దు చేయాలి.

దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి పన్నులు వేయాలి.

పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి.

డెవలప్మెంట్ చార్జీల పేరుతో ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించుకున్న ప్రతి ఇంటికి ప్రభుత్వం అధికారులే సర్వే చేసి ఇంటి పనులు వేయాలని కోరారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం డెవలప్మెంట్ చార్జీలు వచ్చి వస్తువులు చేయాల్సిన వస్తే అది కేవలం వాణి భవనాలకు మాత్రమే పరిమితం కావాలని నివాస గృహాలకు డెవలప్మెంట్ చార్జీలను వసూలు చేయడం వెంటనే ఉపసంహరించుకోవాలని స్వామి డిమాండ్ చేశారు. అదేవిధంగా నివాస ప్రాంతాలలో పెరిగిపోతున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. భద్రాచల పట్టణ ప్రజలకు ఇసుకను అందుబాటులో తీసుకొచ్చే విధంగా గ్రామపంచాయతీ తీర్మానం చేయాలని గడ్డం స్వామి కోరారు.

గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలను పెంచి సకాలంలో వేతనాలు చెల్లించాలి.

గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు.

ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిపిఐఎం ఫ్లోర్ లీడర్ బండారు షర్ట్ బాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వేతనాలను పెంచి సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా వేతనాలు లేక పాశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ పెద్ద పండుగ దసరాకు సైతం వేతనాలు అందకపోతే కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కార్మికులకు వేతనాలను సైతం కనీస వేతన చట్టం ప్రకారం అమలు చేసి సకాలంలో వేతనాలు అందించాలని దానికి అనుగుణంగా గ్రామపంచాయతీ పాలకవర్గం సైతం తీర్మానం చేయాలని కోరారు.

ఆరోపణలపై సమగ్ర రిపోర్టు అందించాలని డిపిఓ కి సబ్ కలెక్టర్ ఆదేశం.

గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా అనంతరం సిపిఐఎం శ్రేణులు ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ మృణాలు శ్రేష్ట వినతి పత్రం అందించారు. సిపిఐఎం ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన సబ్ కలెక్టర్ సమగ్ర రిపోర్టును తనకి ఇవ్వాలని డిపిఓ కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ గ్రామపంచాయతీ పై జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పారిదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామని సిపిఎం శ్రేణులకు హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి, 20వ వార్డు సభ్యురాలు ఇర్పా అనసూయ పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, నకిరికంటి నాగరాజు, కొలగాని రమేష్, జీవనజ్యోతి, ఎస్ అజయ్ కుమార్ నకిరేకంటి నాగరాజు, కుంజ శ్రీనివాస్, చుక్క మాధవరావు, సంద్ర భూపేంద్ర, డి కనక శ్రీ, అంబోజిరత్నం, రావడి అర్చన, డి సంధ్య, సి నాగమణి, డి నాగలక్ష్మి, జి నాగలక్ష్మి, సీనియర్ నాయకులు బీబీజీ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయం -- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.

**- కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే,కు ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు: వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు.**

**సత్తుపల్లి అక్టోబర్ 13 మీ వార్త ఆర్ సి:**

సత్తుపల్లి సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే లక్ష్యంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్న సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్‌కు ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిన్న నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు, సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆమె ఈ అంశాలను శాసనసభలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని కోటేశ్వరరావు తెలిపారు.

సింగరేణి కార్మికులకు ప్రకటించిన కీలక ప్రయోజనాలు లాభాల వాటా సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా కింద రూ.1,754 కోట్ల పంపిణీ, ఒక్కో కార్మికుడికి సగటున సుమారు రూ.1.54 లక్షలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 ప్రత్యేక ఆర్థిక ప్రయోజనం అందించనున్నట్లు తెలిపారు.



**సొంత ఇంటికల ప్రతికార్మిక..**

కుటుంబానికి ఇంటి స్థలం కల్పించాలన్న డిమాండ్‌పై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పన్ను మినహాయింపు అధికారులకు వర్తించే పెర్క్విజిట్స్ పన్ను మినహాయింపు సౌకర్యాన్ని కార్మికులకు కూడా వర్తింపజేసే అంశంపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మారుపేర్ల సమస్య పరిష్కారం ఏళ్ల తరబడి కార్మికులను ఇబ్బంది పెడుతున్న మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. డిస్మిస్ అయిన కార్మికులకు ఉపశమనం ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఒటీఎస్) ద్వారా తిరిగి ఉద్యోగంలోకి వచ్చే అవకాశం కల్పించే అంశంపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల నియామక పత్రాలను 15 రోజుల్లో పంపిణీ చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వైద్య సేవల మెరుగుదల కార్మికులను ఇతర ప్రాంతాలకు తిప్పకుండా ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ నిర్వహించేలా, ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ స్థాయికి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

క్వార్టర్లు, కాలనీల అభివృద్ధి డి-టైప్ క్వార్టర్ల ఆధునీకరణతో పాటు నెహ్రూ హౌసింగ్ కాలనీ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.



**కార్మికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు**

సింగరేణి కార్మికుల సమస్యలను కేవలం సభలో ప్రస్తావించడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వ స్థాయిలో చొరవ చూపుతున్న ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌కు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్‌కు కార్మికుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు.

కార్మికుల చెమట బొట్టుకు తగిన విలువ లభించేలా, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేలా, భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సింగరేణి కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇదే విధమైన చొరవను కొనసాగించాలని కోరుతూ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు, ఐఎన్‌టీయూసీ నాయకులు డా. బి. జనక్ ప్రసాద్‌కు సింగరేణి కార్మికుల తరఫున మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధన కు బతుకమ్మ పండుగ కాంగ్రెస్ నేత గుడిపూడి

**కారేపల్లి అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి :**



తెలంగాణ సంస్కృతి ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు అన్నారు మండల పరిధిలోని గేట్ కారేపల్లి గ్రామంలో మంగళవారం మాట్లాడుతూతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, కుటుంబ అనుబంధాలకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని అభివర్ణించారు. వివాహిత ఆడపడుచులు పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, చిన్ననాటి స్నేహితులతో కలిసి బతుకమ్మ జరుపుకోవడం తెలంగాణ గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు.

బతుకమ్మలో ఉపయోగించే తంగేడు, గునుగు, బంతి తదితర పూలకు సంప్రదాయ ఔషధ ప్రాధాన్యం ఉందని, వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీరు శుద్ధి అవుతుందని తెలిపారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు మహిళల ఐక్యతను, కుటుంబ బంధాలను బలోపేతం చేయడంతో పాటు తెలంగాణ జానపద సంస్కృతిని భావితరాలకు అందిస్తాయని అన్నారు."పూలను పూజించే సంస్కృతి మనది... ఆడపడుచులను గౌరవించే సంప్రదాయం మనది... ప్రకృతిని ప్రేమించే జీవన విధానం మనది" అని పేర్కొన్నారు.బతుకమ్మ తల్లి ఆశీస్సులతో సింగరేణి మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ మరొక సారి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# చర్ల సిహెచ్సి ఆసుపత్రికి ఐటీడీఏ నిధులతో రూ.5.60 లక్షల విలువైన వైద్య పరికరాలు వితరణ.

- భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు.
- ఐటిడిఎ పిఓ బి రాహుల్.

చర్ల అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:

గిరిజనులు గిరిజనేతరులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐటీడీఏ నిధులతో రూ. 5.60లక్షల విలువైన వైద్య పరికరాలను అందించడం జరిగిందని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం చర్ల మండలంలోని సిహెచ్సి ఆసుపత్రి పర్యవేక్షకుడు సాయి వర్ధన్ కి ఆస్పత్రికి ముఖ్యమైన పరికరాలైన ఎక్సమినేషన్ టేబుల్స్, ఎక్సమినేషన్ ఫోకస్ లైట్, ఆక్సిజన్ సిలిండర్స్, ఎయిర్ కండిషనర్ డెలివరీ రూముకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ... ప్రభుత్వ సిహెచ్సి ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. సిహెచ్సి ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఈ వైద్య పరికరాలు గిరిజన ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు ప్రారంభం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశం కలిగిందని అన్నారు. భద్రాచలం నియోజకవర్గం లో అభివృద్ధి పనులను మరింత ముందుకు తీసుకెళ్తామని రానున్న రోజులలో ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడంతో పాటు త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభం ఇస్తామని అన్నారు.

అనంతరం దుమ్ముగూడెం మండలం మొలకలపాడు పీహెచ్సీలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మరియు ఐటీడీఏ పీవో రాహుల్ కలిసి 70 వేల రూపాయల విలువగల వైద్య పరిగరాలను పిహెచ్సికి అందించి ప్రారంభించారు. ఐదు రకాల మీటర్ డెలివరీ సంబంధించిన కిట్ వెయిట్ మిషన్ బిపి ఆపరేటర్ మిషన్ పిహెచ్సి డాక్టర్ రుక్మాకర్ రెడ్డికి అందించారు.

ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, మారుమూల ప్రాంతాలలోని పీహెచ్సీలలో అందించే వైద్య పరికరాల ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు







అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వో సైదులు, డి సి హెచ్ రవిబాబు మరియు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్పై రైతుల ఆసక్తి మండల వ్యాప్తంగా విస్తరిస్తున్న సాగు.

కారేపల్లి అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:

సింగరేణి మండలంలోఆయిల్పామ్ సాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యానశాఖ అధికారులు రైతుల్లో ఆయిల్పామ్ సాగుపై అవగాహన పెంచుతూ వస్తున్నారు. ప్రస్తుతం మండలంలో 500 ఎకరాల్లో సాగు చేస్తుండగా, ఈ ఏడాది మరో 400ఎకరాల్లో సాగు చేసేలా లక్ష్యం పెట్టుకున్నారు. మండలంలో ఆయిల్పామ్ సాగుకు కొన్ని ప్రాంతాల్లో అనువైన భూములు ఉండటం, అధికారులు సైతం రైతుల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం మూలంగా సాగు ఏటేటా పెరుగుతూ వస్తోంది. మండలంలో మొదటిసారి సాగుచేసిన పంట కూడా చేతికొస్తుం డటం వల్ల రైతులు ఆయిల్పామ్ సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సాగుకు వివిధ రకాల రాయితీలు ఇస్తుండటం వల్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది.వరి, పత్తి ఇతర పంటల సాగుకు ఖర్చు పెరగడం, తీరా దిగుబడి వచ్చాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోస్తే నేటికీ కాంటాలు కాకపోవడం, అకా వర్షాలతో పంట నీటి పాలవుతుందనే ఆవేదనలో రైతులు ఉన్నారు. ఈ క్రమంలో పెట్టుబడి తక్కువగా ఉండటంతో పాటు చీడ పీడల బాధలు లేని, సులభతరహా సాగు ఉన్న ఆయిల్పామ్ సాగుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. కొన్నేళ్లుగా ఆయిల్పామ్ సాగు చేయాలని ఉద్యానవన శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వాలు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయి. దీంతో ఆయిల్పామ్ సాగు చేసేందుకు ఆసక్తి చూపే రైతులు ఏటా పెరుగుతున్నారు. 2022లో సాగు ప్రారంభించిన పంటలు గతేడాది నుంచి కోత దశలో ఉన్నాయి. అది కాకుండా అధికారులు



కూడా వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్పామ్ సాగు చేయాలని అవగాహన కల్పిస్తున్న తరుణంలో రైతులు మొగ్గుచూపుతున్నారు.సింగరేణి గ్రామంలో మొదటిసారిగా ఐదు సంవత్సరాల క్రితం ముక్కా మహేష్ రైతు తనకున్న సాగులో పామాయిల్ తోట వేశాడు. ఆ తర్వాత మండలంలోని రైతులు 2026 వరకు 60 మంది పామాయిల్ పంటను వేశారు. పామాయిల్ పంటను కోతుల బెదద ఉండదు.జిల్లా మండలం వ్యాప్తంగా రైతులు ఇప్పటికే 176 మంది రైతులు సుమారు 500 ఎకరాలకు పైగా ఆయిల్పామ్ సాగు చేస్తున్నారు. సంప్రదాయ పంటలతో పాటు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఆయిల్పామ్ సాగు విస్తరిస్తోంది.

అంతర పంటలుగా కూరగాయల సాగు...
ఆయిల్పామ్ మొక్కలు నాటిన మూడేళ్ల వరకు ఎలాంటి దిగుబడి రాదు. దీంతో రైతులు చెట్ల మధ్యలో ఉన్న స్థలాల్లో అంతర పంటలను సాగు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. దీంట్లో భాగంగా కూరగాయల సాగులో బెండ, కాకర, టమాట, బీర, వంకాయతో పాటు ఇతర కూరగాయలు సాగు చేసుకోవడానికి వీలుంటుదని ఉద్యానవనశాఖ అధికారులు



చెబుతున్నారు. పంట నాటిన నాలుగేళ్ల వరకు ఇతర అంతర పంటలతో ఆదాయం పొందే అవకాశం కూడా ఉంటుండటంతో ఆయిల్పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సింగరేణి మండలంలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రైతు సూరపరెడ్డి విష్ణువర్ధన్రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్పామ్ తోటను సోమవారం ఉద్యానవన శాఖ ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ముదిగొండ శ్రావణి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూరైతులు సుస్థిరమైన ఆదాయం కోసం ఆయిల్మ్ సాగు వైపు మొగ్గు పాలన్నారు. వరి, పత్తి పంటల సా అధికంగా పెట్టుబడి అవుతుందని. పంట చేతికొచ్చే సమయంలో అనేక కష్టాలు పడే అవకాశం ఉంటుందన్నారు. ఆయిల్పామ్ సాగుతో మూడేళ్లు కష్టపడితే 30ఏళ్ల వరకు నికరంగా ఏడాదికి రూ. 3లక్షలకుపైగా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. సాగుకు ప్రభుత్వం కూడా పలు రాయితీలు కల్పిస్తుందన్నారు. వంట నూనెల ధరలు పెరగడంతో వీటికి డిమాండ్ అధికంగా ఉందన్నారు. రైతులు ఇందుకోసం అధికంగా ఆయిల్పామ్ వైపు మొగ్గుచూపి అధిక లాభాలు గడించవచ్చన్నారు.

# ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ పోటీలు.

అశ్వరావుపేట అక్టోబర్ 13 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:

క్రీడాకారుల మనసు గెలిచిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆతిథ్యం.. మాధురి రెడ్డి అభినందనలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఇండోర్ మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ పోటీలు ఘనంగా ముగిశాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సతీమణి శ్రీమతి మాధురి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారిణులను అభినందించి ఆశీర్వదించారు. రాష్ట్ర మాజీ ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వ విజయబాబు కూడా కార్యక్రమానికి హాజరై క్రీడాకారిణులను అభినందించారు. మూడు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో నల్గొండ జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించగా రంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుంది. భద్రాద్రి కొత్తగూడెం మేడ్చల్ జిల్లా జట్లు సంయుక్తంగా తృతీయ బహుమతి సాధించాయి .విజేత జట్లకు అతిథులు బహుమతులు అందజేసి క్రీడాకారిణులను అభినందించారు.

క్రీడాకారిణులను సొంత బిడ్డల్లా చూసుకోవడం సంతోషాన్నిచ్చింది ఎమ్మెల్యే జారె ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు క్రీడా సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోటీల



నిర్వహణలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తించి సన్మానించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారిణులకు మంచి వసతి నాణ్యమైన భోజనం అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలనే తమ ప్రధాన లక్ష్యం గా పనిచేస్తూ విజయవంతం అయ్యామని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారిణులకు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు కల్పించడం ఎంతో అవసరమని అన్నారు అశ్వారావుపేటలో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.క్రీడాకారిణులకు ఆత్మీయ ఆతిథ్యం.. మాధురి రెడ్డి అభినందనలు. ముగింపు కార్యక్రమంలో మాధురి రెడ్డి క్రీడాకారిణులను అభినందిస్తూ క్రీడల్లో గెలుపోటములు సహజమని పట్టుదలతో సాధన చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారిణులకు మంచి వసతి భోజనం ఆత్మీయ వాతావరణం కల్పించి పోటీలను విజయవంతం చేసిన ఎమ్మెల్యేని అభినందించారు. సొంత పిల్లల్లా చూసుకున్నారు.. మళ్లీ మళ్లీ ఇక్కడికే రావాలనిపిస్తోంది. ఈ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల కెప్టెన్లతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేకంగా మాట్లాడించి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అశ్వారావుపేటలో కల్పించిన సౌకర్యాలు ఆతిథ్యం గురించి క్రీడాకారిణులు



తమ అభిప్రాయాలను వెల్లడించారు. తమను సొంత పిల్లల్లా చూసుకున్నారని మంచి భోజనం అందించారని సౌకర్యవంతమైన వసతి కల్పించారని ఇంత ఆప్యాయంగా ఆదరించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని క్రీడాకారిణులు పేర్కొనడం విశేషం. అశ్వారావుపేటలో గడిపిన రోజులు మధురమైన అనుభూతిని ఇచ్చాయని మళ్లీ మళ్లీ ఇక్కడికి వచ్చి ఆడాలని ఉందని ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లాలంటే బాధగా ఉందని వారు చెప్పడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సహకరించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు.
పోటీల నిర్వహణలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు ముఖ్యంగా మున్సిపాలిటీ సిబ్బంది వివిధ శాఖల ఉద్యోగులు క్రీడా నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందించిన సేవలను ప్రత్యేకంగా గుర్తించారు. కార్యక్రమ విజయానికి కృషి చేసిన వారందరినీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు .మూడు రోజుల పాటు క్రీడా పోటీలతో సందడిగా మారిన అశ్వారావుపేట ఇండోర్ మినీ స్టేడియం విజేతల సంబరాలు క్రీడాకారిణుల ఆనందం నిర్వాహకుల ఆత్మీయతతో పండుగ వాతావరణాన్ని తలపించింది పోటీలు విజయవంతంగా ముగియడంతో అశ్వారావుపేటలో క్రీడల అభివృద్ధికి ముఖ్యంగా బాలికల క్రీడా ప్రతిభకు మరింత ప్రోత్సాహం లభించిందని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## కోటమైసమ్మ జాతర ప్రాంతాన్నిపరిశీలించిన సీఐ

- ఈనెల 20 నుంచి జాతర
- ట్రాఫిక్, పార్కింగ్పై ప్రత్యేక దృష్టి - సీఐ ఎన్.సాగర్, ఎస్సైబి.గోపి





కారేపల్లి అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి :

సింగరేణి ప్రాంతంలో అతి పెద్ద జాతర కోటమైసమ్మ జాతర ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కోటమైసమ్మ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సింగరేణి సీఐ నూనావత్ సాగర్, ఎస్సై బైరు గోపి లు జాతర జరిగే శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయ పరిసరాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ కు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వారు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కే.వెంకటయ్య లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో జాతర విజయవంతానికి కృషి చేస్తున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్ కృష్ణ, పర్సా లలిత్ సాయి, ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నోబుల్ పీస్ ప్రైస్ అవార్డు అందుకున్న నవనీతం నవీ పిల్లై



కొత్తగూడెం అక్టోబర్ 13 మీ వార్త ఆర్ సి : సమాజంలో ఎందరో కొడుతూ ఉంటారు జుడుతూ ఉంటారు కానీ కొందరు పుట్టిన వారి జీవితాన్ని స్వార్ధకతం చేసుకోవడం కోసం మంచి మనసుతో తోటి వారికి సహాయ సహకారాలు అందిస్తూ ఉంటారు తాను తాను తిన్న తినకుండా ఉన్నా లేకున్నా




తోటి వారి కష్టసుఖాల్లో భాగస్వాములుగా నిలుస్తారు అలాంటి వ్యక్తి నవనీతం నది పిల్లే వారు చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం, నోబుల్ పీస్ ప్రైస్ - 2026 అవార్డు అందించడం జరిగినది, ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్ గ్రహీత ఐనా జస్టిస్ నవనీతం నవి పిల్లే కి శుభాకాంక్షలు తెలుపుతూ మొక్క నాటినారు. సమాజ శ్రేయస్సు కి ఎంతో కృషి చేసి నోబుల్ పీస్ ప్రైస్ - 2026, పొందిన జస్టిస్ నవనీతం నవి పిల్లే లాంటివారు అరుదుగా ఉంటారని భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సింగరేణి కార్పొరేట్, ప్రకాశం స్టేడియంలో ఒక లక్ష్మణ ఫలం మొక్కను నాటి శుభాకాంక్షలు తెలిపారు మొక్కల రాజశేఖర్, జస్టిస్ నవనీతం నవీ పిల్లే అతి పేదరిక కుటుంబంలో జన్మించి,ఎన్నో కష్టాలు అనుభవించి సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను తొలగించడానికి ఎంతో కృషి చేశారు, ఈ యొక్క కృషిలో వారు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు, అని నేడు ప్రపంచ శాంతి బహుమతికి ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని, ఇంకా అత్యున్నతమైన శిఖరాలు అధిరోహించాలని, భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ చే 114 మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసలు పొందిన ప్రకృతి ప్రేమికుడు మొక్కల కె.ఎన్ రాజశేఖర్ అన్నారు

## సర్పంచ్‌ను పరామర్శించిన సింగరేణి మండల సర్పంచులు.....



**సింగరేణి, అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాటిమీద గుంపు గ్రామ పంచాయతీ సర్పంచ్ గుగులోత్ సుజాత సంతోష్‌ను సింగరేణి మండల సర్పంచులు పరామర్శించారు. గాదెపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచులు ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైరా శాసనసభ్యులు వీడియో కాల్ ద్వారా సుజాత సంతోష్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సూర్య తండా సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడు బానోత్ రాందాస్ నాయక్, ఉపాధ్యక్షుడు మోతి వీరస్వామి, పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మ వీరభద్రు, గేట్ కారేపల్లి సర్పంచ్ పూసం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా వ్యాపారులు వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయవద్దు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్

కామేపల్లి, అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి :



లైసెన్స్ లేకుండా వ్యాపారులు వ్యవసాయ ఉత్పత్తులు పత్తి, ధాన్యం, మొక్కజొన్న,మిర్చి ని కొనుగోళ్లు చేయవద్దని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఎం ఏ అలీమ్ ఆదేశించారు.కామేపల్లి మండలం ముచ్చర్ల వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ ను మంగళవారం సందర్శించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా లోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని నోటిఫై డ్ ఏరియాలో వ్యవసాయ మార్కెట్ కమిటి లైసెన్స్ లేకుండా పత్తి, ధాన్యం లేదా ఇతర వ్యవసాయ ఉత్పత్తు లను కొనుగోలు చేయడం పూర్తిగా నిషేధించబడిన దని తెలిపారు.వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు నిర్వ హించదలచిన వ్యాపారులం దరూ వ్యవసాయ మార్కెట్ కమిటి లైసెన్స్ పొందిన త రువాతనే కొనుగోలు కార్యక లాపాలను ప్రారంభించాలని సూచించారు.లైసెన్స్ లేకుం డా కొనుగోళ్లు నిర్వహించే వ్యాపారులపై తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల మార్కెట్ల చట్టం, 1966 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంద ని హెచ్చరించారు.జిల్లాలోని వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు నిర్వహించదల చిన వ్యాపారులందరూ నూతన లైసెన్సు కొరకు సంబందిత వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ని సంప్రదించాలని ఆయన కోరారు.జారీ చేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన ఆదేశించారు.

## పింజరమడుగులో బతుకమ్మ ఉత్సవాల సందడి

- సంస్కృతి సంప్రదాయా లకు ప్రతీకగా పూల పండుగ సంబరాలు
- ఆటపాటలతో మహిళలలో ఆనందం

కామేపల్లి, అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి



కామేపల్లి మండలం పింజరమడు గ్రామం లోని పాండవుల వారి గుడి సెంటర్ లో బతుకమ్మ ఉత్సవాలను సాంప్రదాయ బద్ధంగా,అత్యంత భక్తిశ్రద్ధల తో మంగళవారం రాత్రి నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి



సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరా లను నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సాంప్రదాయ ఆటపాటలతో సంబరాలను నిర్వహించారు.మహిళలు ఉత్సవాలలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు.డేగల రాంబాబు ఆధ్వర్యంలో పింజరమడుగు యూత్ సారథ్యంలో వైభవంగా నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలలో గ్రామ పెద్దలు గుజ్జర్లపూడి రాంబాబు, వింజం నాగభూషణం, కిన్నెర రామచంద్రయ్య, యూత్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఐ టి డి ఏ ముందు కొనసాగుతున్న రెండవ రోజు రిలే దీక్షలకు ఆదివాసి సంక్షేమ పరిషత్తు, మాల మహానాడు మద్దతు ప్రకటించిన నాయకులు.



**భద్రాచలం అక్టోబర్ 13 మన మీ వార్త:** భద్రాచలం ఐ టి డి ఏ ముందు కొనసాగుతున్న గోండ్వానా సంక్షేమ పరిషత్తు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండవ రోజుకు చేరుకున్నాయి.. రెండో రోజు దీక్షకు మద్దతు ప్రకటించిన ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు సొందే మల్లు దొర. రేసు ఆదినారాయణమూర్తి పటేల్. మరియు మాల మహానాడు జిల్లా నాయకులు దాసరి శేఖరు మద్దతు ప్రకటించారు. సోందే మల్లు దొర మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలో పని చేస్తున్నటువంటి అధికారులు షెడ్యూల్ ప్రాంతాల చట్టాలను పూర్తిగా అవగాహన చేసుకుని మన ప్రాంతంలో ఉద్యోగాలు చేయాలని డిమాండ్ చేశారు. మాకు సంక్రమించిన రాజ్యాంగ హక్కులు. మా భూములు మాకు దక్కాలంటే. ఏకైక మార్గం ఒక్కటే స్వయం పాలన కావాలని మేము గట్టిగా డిమాండ్ చేస్తున్నాము. ఈ బూర్జువా రాజకీయ పార్టీలు ఆదివాసీలను ఓటు బ్యాంకు కిందే వాడుకుంటున్నాయి గాని ఆదివాసుల అస్తిత్వం కోసం సొ చట్టసభల్లో మాట్లాడకపోవడం సోషనీయమని తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాచలం నడిబొడ్డున గత పది సంవత్సరాలుగా ఎల్ టి ఆర్ 1/70 చట్టం తూట్లు తూట్లుగా ఉల్లంఘన అధికారుల మరియు ఎమ్మెల్యే కను సన్నుల్లో జరుగుతున్నాయని సూటిగా ప్రశ్నించారు..

ఆదివాసి సంఘాలు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఇక్కడున్న ఐఏఎస్ అధికారులు ఏమాత్రం పరిగణ లోకి తీసుకోవడం లేదని విమర్శించారు. రెండో రోజు కార్యక్రమంలో కూర్చున్న వారు సొందే వీరయ్య, పాయం సన్యాసి, కొవ్వాస్ ఎడ్మా, మడకం గంగ, గుండి పుల్లయ్య, మడకం దుర్గ, మడకం లక్క, సోయం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పొన్నెకల్లు లో లో వోల్టేజి సమస్య పరిష్కారం

- ట్రాన్స్ కో అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

కామేపల్లి, అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం పొన్నెకల్లు గ్రామం లో మధ్య బజార్లో చాలా రోజుల నుండి లో వోల్టేజ్ సమస్యతో తరచూ ఇళ్లల్లో లైట్లు,టీవీలు కాలిపోతున్నా యి.దీంతో లో వోల్టేజీ సమస్యను సర్పంచ్,ఉప సర్పంచ్ కొత్త లింగాల ట్రాన్స్ కో ఏఈ ఎన్.శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లగా స్పం దించిన ఏఈ 25 కేవీ సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ ను మంగ ళవారం ఏర్పాటుచేసి తద్వారా ట్రాన్స్ఫార్మర్ను ను ఏర్పాటు చేసి లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించారు

. 25 కే.వి సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభ కార్య క్రమంలో ఖమ్మం డిసిసి జనరల్ సెక్రెటరీ గింజల నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడారు.ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యం లో ప్రభుత్వం విద్యుత్ సమ స్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.గ్రామంలో ఏర్పా టు చేసిన సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ వలన ఇళ్లలోకి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని , పలు గృహములలో విద్యుత్ సమస్యతో బాధపడుతున్న వారికి సమస్య తీరిందని పేర్కొన్నారు.పేదలకు 200 యూనిట్లు ఉచిత కరెంట్ ఇవ్వడం, కొత్తగా కరెంటు మీటరు ఏర్పాటు చేసుకుంటే కరెంటు లైన్ కు ఇల్లు దూరంగా ఉంటే ఉచితంగా పోల్ ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు.పంటలకు కూడా నాణ్యమైన త్రీఫేస్ ఉచిత కరెంటు నిరంతరం సరఫరా జరుగుతుందని ఎక్కడ లో వోల్టేజ్ ఉన్న అదనపు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి రైతుల ఇక్కట్లను ప్రభుత్వం నివారిస్తున్నట్లు తెలిపారు.ఎల్ నినో ప్రభావం వలన రాబోయే రోజుల్లో కరెంటు ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కరెంటు ను పొదుపుగా వాడుకోవా లని కోరారు.కాగా గ్రామంలో లో వోల్టేజ్ సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి కరెంటు సమస్యను పరిష్కరించిన విద్యుత్ సిబ్బందికి గ్రామస్తు లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ భూమిక,ఉప సర్పంచ్ మల్లెల వసంతరావు,లైన్ ఇన్స్పెక్టర్ మధు,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు వల్లభనేని అశోక్



,పాలకవర్గ సభ్యులు కూరాకుల మల్లేష్,ఆలేటి రజిత కిరణ్,విద్యుత్ సిబ్బం ది రాజుల వెంకన్న,బద్రు నాయక్, జిల్లా తెలుగు యువత నాయకులు నూకల శ్రావణ్, చిలుముల వెంకటరెడ్డి, నూకల వెంకన్న, బోరి గొర్ల నవీన్, దండుగుల కర్ణ, సత్యం, ఉపేందర్ , పొనుగోటి నాగేశ్వరరావు, శ్రీరామ్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులు మరణించిన ప్రజల హృదయాలలో జీవించి ఉంటారు.

- కామ్రేడ్ మంజులకు విప్లవ జోహార్లు అర్పించిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ
- కామ్రేడ్ మంజుల మరణం పి ఓ డబ్ల్యు జిల్లా సంఘానికి తీరని లోటు

కొత్తగూడెం అక్టోబరు 13 మీ వార్త ఆర్ సి

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పట్టణ కమిటి సభ్యురాలు, పి ఓ డబ్ల్యు జిల్లా నాయకురాలు కామ్రేడ్ మంజుల మరణం పార్టీకి ప్రజా సంఘాలకు తీరని లోటుగా భావిస్తున్నామని ఆ ఉద్యమ నాయకురాలకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కొత్తగూడెం పట్టణ కమిటీ సభ్యులు, పి ఓ డబ్ల్యు జిల్లా నాయకురాలు కామ్రేడ్ మంజుల ఆరోగ్యంతో 12.10.26 న రాత్రి నిమ్స్ హాస్పిటల్ నందు మరణించింది.2004 నాలుగులో ప్రారంభమైన పి డి ఎస్ యు ఉద్యమ ప్రస్థానం 2026 వరకు నమ్ముకున్న జండా కోసం ఎజెండా కోసం పనిచేస్తుంది. అనేక విద్యార్థి ఉద్యమంలో తెలంగాణ సాధన పోరాటంలో తన వంతు పాత్ర పోషించింది జైలు నిర్బంధాలను కేసులను ఎదుర్కొన్నది.

ఐ ఎఫ్ టి యు ఆఫీస్ నందు సందర్శనార్థం తన పార్టీల దేహాన్ని ప్రజలకు కార్యకర్తలకు సందర్శనార్థం ఐ ఎఫ్ టి యు పోరాటం కొత్తలో ఉంచడం జరిగింది. తమ్ముడు మందుల పార్థివ దేహంపై సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు జండా కప్పినారు. కామ్రేడ్ మంజుల సంతాప సభ ఐ ఎఫ్ టి యు కొత్తగూడెం ఏరియా కార్యదర్శి కామ్రేడ్ సంజీవ అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, సిపిఎం జిల్లా నాయకులు లిక్కి బాలరాజు, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కె.సురేందర్,ఉక్లా,తెలంగాణ ఉద్యమకారులు వెంకట పుల్లారావు, పురుషోత్తం, ఎస్ ఉపేందర్ రావ్, అనుదీప్, విద్యార్థి ఉద్యమ నాయకులు కంపాటి పృథ్వి, సాంబ, ప్రణయ్, గణేష్,అభిమన్యు,అజిత్,లు ప్రసంగిస్తూ గుండాల మండలం లింగగూడెం లో జన్మించి పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ హాస్టల్లోనే ఎంబీఏ వరకు చదువుకొని అనే ఒక అవకాశాలు వచ్చినా



ఉద్యమంలోని కొనసాగింది. కొండ జంపన్న ప్రేమ వివాహం చేసుకొని,అద్విన్ పూలే అని కుమారుడికి జన్మనిచ్చింది. భర్త గత ఆరు సంవత్సరాలుగా అనారోగ్యంతో కష్టంగా బాధపడుతుంది. చికిత్స పొందుతూ ఈ మధ్యకాలంలో కొంత సీరియస్ కావడంతో పదో తారీకు రాత్రి హైదరాబాద్ తీసుకువెళ్లారు పదం 12 నైట్ 10 గంటలకు మరణించింది.

ఐ ఎఫ్ టి యు రైటర్ బస్తి నుండి రామవరం బ్రిడ్జి వరకు కామ్రేడ్ మంజుల అంతిమయాత్రని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అభిమానులు పార్టీ కార్యకర్తలు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో మద్యం కల్తీనా..? అసలుదేనా..?

- మందుబాబుల ఆరోగ్యంతో చెలగాటమా..? మద్యం నాణ్యతపై తేలాల్సిన నిజాలెన్నో!
- మద్యం సీసాల్లో ఉన్నది అసలు సరుకేనా ..? నాణ్యతను పరిశీలించేదెవరు ..?
- ఎక్సైజ్ అధికారుల తనిఖీలు ఎక్కడ..?

సత్తుపల్లి, అక్టోబర్ 13మీ వార్త ఆర్ సి

మద్యం సీసాపై బ్రాండ్ పేరు ఉంటే సరిపోతుందా..? ప్రభుత్వ అనుమతితో విక్రయిస్తున్నంత మాత్రాన ప్రతి సీసాలోనూ నాణ్యమైన మద్యమే ఉంటుందా..? మద్యం అసలుదా..? కల్తీ జరిగిందా..? ఒకవేళ కల్తీ జరిగితే గుర్తించేదెవరు..? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తేల్చాల్సిన అవసరం ఉంది. సత్తుపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యతపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలనే అంశం ఇప్పుడు ప్రజాప్రయోజన కోణంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

**సీసాపై సీల్ ఉంటే సరిపోతుందా..?**

మద్యం తయారీ నుంచి సరఫరా, నిల్వ, విక్రయం వరకు ప్రతి దశలోనూ నిబంధనలు పక్కాగా అమలవుతున్నాయా..? మద్యం సీసాల సీళ్లు, బ్యాచ్ నంబర్లు, స్టాక్ వివరాలు, సరఫరా రికార్డులను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా..? అన్నది తేలాల్సి ఉంది.

మద్యం పేరుతో ఎక్కడైనా అక్రమాలకు పాల్పడితే అది




కేవలం ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాదు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే అవుతుంది.

**ప్రభుత్వానికి ఆదాయం.. వినియోగదారుడి ఆరోగ్యానికి భరోసా ఏది?**

మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతున్న నేపథ్యంలో వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందేలా చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత శాఖలపైనే ఉంది. మద్యం కొనుగోలు చేసిన వినియోగదారుడికి దాని నాణ్యతపై అనుమానం వస్తే ఫిర్యాదు చేసేందుకు ఎలాంటి వ్యవస్థ అందుబాటులో ఉంది? ఫిర్యాదు అందిన వెంటనే నమూనాలను పరీక్షించే విధానం ఎంత సమర్థంగా అమలవుతోంది

# హైస్పీడ్ రైల్ కారిడార్ల చిచ్చు!

**హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ కారిడార్ల వ్యవహారం ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ రగడకు కారణమవుతోంది. ఒకవైపు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసి, భూసేకరణకు హడావుడి చేస్తుంటే.. మరోవైపు అలైన్‌మెంట్ ఇంకా ఖరారే కాలేదని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలు కేవలం సాంకేతిక లోపాలా లేక రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న వ్యూహాలా అనే అనుమానాలకు తావిస్తున్నాయి.తెలంగాణ మీదుగా ముంబై, బెంగళూరు, చెన్నైలకు హైస్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు కోసం గతంలో రైల్వే అధికారులతో అనేక దఫాలు చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన రైల్వే అధికారులు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహాదూర్‌గూడలో రైల్ హబ్ కోసం 400 ఎకరాలు కేటాయించడాన్ని ప్రాథమికంగా ఖరారు చేసుకున్నారు. రాష్ట్ర కేబినెట్ సైతం దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.అంతర్గతంగా మార్గాలను నిర్ణయించుకున్న అధికారులు, హాలియా వంటి పలు ప్రాంతాల్లో ఎరుపు, తెలుపు రంగులతో మార్కింగ్‌లు కూడా చేశారు. తెలంగాణ పరిధిలో ముంబై-పుణే కారిడార్ 93 కిలో మీటర్లు, హైదరాబాద్-బెంగళూరు 205 కిలోమీటర్లు, హైదరాబాద్-చెన్నై 180 కిలోమీటర్ల చొప్పున మార్గాలను ప్రతిపాదించారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పక్కనే వెళ్లేలా సవరణలు కూడా చేశారు. ఇదంతా సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ప్రకటన ఈ ప్రణాళికలన్నింటినీ ఒక్కసారిగా గందరగోళంలోకి నెట్టింది.కారిడార్ల అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదని, భూసేకరణ చేయడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర మంత్రి స్పష్టం



చేయడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని, భూముల గుర్తింపు కోసం అధికారులను రంగంలోకి దించడం, దీనివల్ల ప్రజల్లో భయాందోళనలు తలెత్తడం రాజకీయంగా అధికార పార్టీకి ఇరుకును తెస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కింగ్‌లు వచ్చిన తర్వాత, అసలు అలైన్‌మెంట్ ఖరారే కాలేదనడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపాన్ని లేదా రాజకీయ లబ్ధి కోసమే ఉద్దేశపూర్వకంగా చేస్తున్న జాప్యాన్ని ఎత్తిచూపుతోంది.

ఒకవైపు అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో తాము వేగంగా అడుగులు వేస్తుంటే, కేంద్రం మాత్రం నిబంధనల పేరుతో బ్రేకులు వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ముందుకు వెళ్తే సహించేది లేదనే సంకేతాలను కేంద్రం పంపుతోంది. మొత్తానికి, హైస్పీడ్ రైల్ కారిడార్ల అలైన్‌మెంట్ తకరారు కేవలం సాంకేతిక సమస్య కాస్తా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజకీయ రగడగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.